ప్రజాశక్తి
శుక్రవారం 17 మే 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

లాంచీలో బిక్కుబిక్కుమంటూ ఉన్న ప్రయాణీకులు

నదిలో ఇసుక దిబ్బలను ఢీకొన్న లాంచీ

- మూడు గంటలు బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రయాణీకులు
- పోలీసులు, మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు
- ఊపిరిపీల్చుకున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కష్ణా నదిలో ఇసుక దిబ్బలకు తగిన ప్రయాణీకులతో వెళుతున్న లాంచీ ఇరుక్కుపోవడం తీవ్ర ఆందోళన కలిగించింది. సేకరించిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం 6 గంటలకు 27మంది ప్రయాణికులతో లాంచీ గుంటూరు జిల్లా రాయపూడి నుండి ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పెర్రీకి బయలుదేరింది. రాత్రి 7 గంటలకు పెర్రీకి చేరాల్సిన లాంచీ నది మధ్యలో ప్రమాదానికి గురైంది. నదిలో సరిగా నీరు లేకపోవడంతో లింగాయపాలెం పరిసర ప్రాంతానికి (మిగతా 2లో)

18న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ఇన్చార్జి ముఖ్య కార్య నిర్వహణ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు , అధికారులు సమయానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ముందుగా ఉదయం 10 గంటలకు స్థాయి సంఘ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా సంఘాల అధ్యక్షులు, సభ్యులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

పడకేసిన పాలన...

- సమస్యల వలయంలో ప్రజలు
- మంచినీటి ఎద్దడి, పారిశుద్ధ్య లేమి
- డ్రైన్లు అస్తవ్యస్తం
- అమలుకాని సమ్మర్ యాక్షన్‌ప్లాన్
- ఎన్నికల కోడ్ పేరుతో మౌలిక సమస్యలపై దృష్టి సారించని వైనం

ప్రజాశక్తి - విజయవాడ

నగర పాలన గాడి తప్పింది. ఎన్నికల హడావుడిలో నగర సమస్యలను గాలికొదిలేశారు. ఫలితంగా ప్రజలు పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు ఎన్నికల ఆలోచన నుంచి బయటపడకుండా దాని చుట్టూతే తిరుగుతూ కాలయాపన చేస్తున్నారు. నగరపాలక సంస్థ పాలకవర్గంతోపాటు అధికారులు, ఉద్యోగులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పలు సమస్యలతో నగర ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, నాలుగు వారాల నుంచి ఎన్నికల విధుల్లో ఉన్న విఎంసి అధికారులు, ఉద్యోగులు, కింద స్థాయి సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మేయర్, డిప్యూటీ మేయర్లు, పాలకవర్గ సభ్యులు తమ తమ పార్టీల తరపున ఈ ఎన్నికల్లో తలమునకలై ఉండడంతో ప్రజలను సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రజాసమస్యలపై ఆలోచించే తీరిక కూడా లేని పరిస్థితి ఏర్పడింది. స్తంభించిపోయిన విఎంసి పాలనతో అనేక సమస్యలు నగరవాసులను చుట్టుముట్టాయి. ప్రధానంగా మంచినీటి ఎద్దడి, దోమల బెడద, విషజ్వరాలు, అధ్వానంగా తయారైన డ్రైనేజి వ్యవస్థ, పారిశుధ్యలేమి, తగ్గిపోయిన రెవెన్యూ రాబడి, ముఖ్యంగా విఎంసితో సంబంధం ఉన్న ప్రజల విన్నపాలను పరిష్కరించే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మంచినీటి కోసం నగర శివారు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక కలుషిత నీటిని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నగరప్రజలకు మంచినీటిని సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అధికారుల పర్యవేక్షణ లోపించింది. ఇక్కడ నీటి శుద్ధి సరిగా లేనందున మురుగునీటినే పైప్‌ల ద్వారా సరఫరా చేస్తున్నారని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనిరీతిలో ప్రకాశం బ్యారేజి వద్ద నీటి మట్టం తగ్గిపోయింది. నది నుంచి వచ్చే పాచిపట్టిన మురుగునీటిని హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద 11 ఎంజిడి, మిగిలిన ప్లాంట్లలో ప్రమాణాలకనుగుణంగా శుద్ధి చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఎన్నికల సాకుతో అధికారులు, పాలకవర్గంవారు సమ్మర్‌యాక్షన్‌ప్లాన్ అమలును పూర్తిగా విస్మరించారు. తుప్పుపట్టి, దెబ్బతిన్న బోర్లు మరమ్మతులు, లీకవతున్న మంచినీటి పైప్‌లైన్ల రిపేర్లు, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పర్యవేక్షణ, కేంద్రీకరణ లేకపోవడం, మంచినీటికి ఇబ్బందులు పడుతున్న శివారు కాలనీలకు మరిన్ని ట్యాంకర్ల ద్వారా సమృద్ధిగా నీటిని సరఫరా చేసే పరిస్థితులు లేకపోవడం, కుక్కల బెడద వంటివి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలకు శుద్ధి చేసిన, తగిన ప్రమాణంలో మంచినీటిని సరఫరా చేసే పరిస్థితి లేదు. దీని వల్ల జక్కంపూడి, కండ్రిక, వాంబేకాలనీ, ఆర్ఆర్‌పేట, పటమట తదితర ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నగరవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా వందల సంఖ్యలో ఉన్న ప్రైవేటు మంచినీటి ప్లాంట్లు, హెవీమోటార్ల ద్వారా భూగర్భ జలాలను పెద్దఎత్తున తోడేస్తూ, నీటి చోరీకి పాల్పడుతూ, వీటి పక్కనే ఉన్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు (మిగతా 2లో)

కొనకళ్లను పరామర్శిస్తున్న కొల్లు రవీంద్ర తదితరులు

మాజీ ఎంపి కొనకళ్లకు గుండెపోటు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు, టిడిపి కష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు గురువారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మచిలీపట్నంలోని గుండె వైద్య నిపుణులు ప్రేమ్ కుమార్ ఆసుపత్రికి తరలించారు అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నారాయణరావు (మిగతా 2లో)

సుందరయ్య వర్ధంతి సందర్భంగా

20న 'దేశ సమైక్యత - ఎదురవుతున్న సవాళ్లు'పై స్మారకోపన్యాసం

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ : స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భాతర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంట్లో ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు "దేశ సమైక్యత – ఎదురవుతున్న సవాళ్లు" అంశంపై స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గవర్నరుపేటలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఎసి ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపి పి.మధు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. 'దేశ సమైక్యత' అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

విజయవాడ సింగ్‌నగర్‌లో ప్రజలను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు, సిపిఎం నేతలు

ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటాం

సిపిఎం సెంట్రల్ అభ్యర్థి సిహెచ్.బాబూరావు

వార్త 8లో

ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఓట్ల లెక్కింపునకు అధికారులు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు అన్నారు. జూన్ 4వ తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమిష్టి కషితో జిల్లాలో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని ఇదే స్ఫూర్తిని లెక్కింపు ప్రక్రియలోను కొనసాగించి విజయవంతం చేయాలని అన్నారు. ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, సీల్ వేసిన డోర్‌లు, సెక్యూరిటీ, కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాలు, భద్రత పర్యవేక్షణపై నియమించిన గెజిటెడ్ అధికారులు, పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద నుండి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలు తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆదేశించారు. లెక్కింపు కేంద్రంలో అసెంబ్లీకి, పార్లమెంటుకు ఒక్కోదానికి 14 టేబుళ్ల చొప్పున 28 టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ చేపట్టాకే ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకరాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను త్వరగా ప్రకటించేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో డిఆర్‌ఓ వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మి ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పాలన

(మొదటి పేజీ తరువాయి)

చుక్కనీరు అందకుండా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ప్రైవేటు ప్లాంట్ల యజమానుల నుంచి భారీ మొత్తంలో ముడుపులు పుచ్చుకుంటూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శ బాహాటంగానే వినిపిస్తోంది. నగర ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి ఎద్దడిపై, శుద్ధి చేసిన నీటిని తగిన ప్రమాణంలో సరఫరా చేయాలని ఎన్నికల ప్రచార సమయంలో సిపిఎం అభ్యర్థితోపాటు ఆపార్టీ నేతలు నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాక స్థానిక ప్రజలను కలుపుకొని నిరసనలకు దిగారు. ఎన్నికల కోడ్ సాకు చూపి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండకుండా, తక్షణమే అధికారులు రంగంలోకి దిగి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నగరంలో గుండా వెళ్తున్న కాల్వలతోపాటు నగరం చుట్టుపక్కల ఉన్న ఔట్‌పాల్ డ్రైన్లు, మేజర్, మీడియం డ్రైన్లలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడికతీత పనులను పూర్తిగా ఆపేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వర్షం నీరు, మురుగునీరు ఎక్కడా ఆగకుండా ఉండటానికి వీలుగా ప్రతి వేసవిలో క్రమం తప్పకుండా డ్రైన్లలో పూడిక తీయిస్తుంటారు. కానీ ఈ ఏడాది ఎన్నికల సాకుతో పూడికతీత పనులకు బ్రేక్ పడినట్లయింది. ముఖ్యంగా ఈపనిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా... ఆదిశగా ఎక్కడా పనులు జరగడం లేదు. నిధులు కూడా లేవు. డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారు కావడంతో వేసవిలో కూడా దోమలు విజృంభిస్తున్నాయి. బందర్, ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వల పక్కన నివాసముంటున్న వేలాది కుటుంబాల ప్రజలకు పట్టపగలు కూడా దోమల బెడద తప్పడం లేదు. దీంతో విషజ్వరాల బారిన పడుతున్నారు. మరోవైపు కలుషిత నీటిని తాగుతూ ఎండల తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు సైతం అతిసార బారిన పడుతున్నారు. అలాగే అధికారుల నుండి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రెవెన్యూ వసూళ్లు మందగించాయి. గ్రీవెన్స్ నిలిచిపోయింది. ఏ చిన్న సమస్యపై కూడా విఎంసిలో నగర ప్రజలు అర్జీ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. నగరపరిధిలో నిర్వహిస్తున్న అర్బన్‌హెల్త్ సెంటర్లు (ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రాలు) వైద్యసేవలు అరకొరగానే నడుస్తున్నాయి. పారిశుధ్యం లోపించింది. పెరిగిన పని భారానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేక, ఉన్న కార్మికులు కూడా మండుతున్న వేసవి తాకిడితో అనారోగ్యాలు పాలవుతూ పని చేయలేని పరిస్థితుల్లో అల్లాడుతున్నారు. కార్మికులకు సెలవులు, వేతనాలు మంజూరు సరిగా లేకుండాపోయింది. ఇప్పటికైనా విఎంసి పాలకవర్గం, అధికారులు ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ప్రజలకు అవసరమైన మౌలిక అవసరాలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నదిలో ఇసుక దిబ్బలను ఢీకొన్న లాంచీ

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేసరికి ఇసుక దిబ్బలను ఢీకొని ఆగిపోయింది. దీంతో ప్రయాణీకులు తీవ్రంగా ఆందోళన చెందారు. తమ వారు నదిలో ఇరుక్కుపోవడంతో ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని ప్రయాణీకుల కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. నదిలో లాంచీ ఇరుక్కుపోయిన విషయం, అందులో ఎంపి ఎంపి నందిగం సురేష్ బంధువులు కూడా ఉన్నారనే సమాచారంతో వెస్ట్‌జోన్ ఎసిపి మురళీకష్ణా రెడ్డి నేతత్వంలో ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్యనారాయణ అప్రమత్తంగా వ్యవహరించారు. స్థానిక మత్స్యకారుల సహకారంతో యుద్ధప్రాతిపదికన మర పడవలను పంపి రాత్రి 10.30 గంటల సమయంలో ప్రయాణీకులను ఫెర్రీ ఒడ్డుకు చేర్చారు. నది మధ్యలో సుమారు 3 గంటలపాటు ప్రయాణీకులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఎట్టకేలకు పోలీసులు, మత్స్యకారుల సహాయంతో ప్రయాణీకులను ఫెర్రీ వద్ద ఒడ్డుకు చేరడంతో ప్రయాణీకుల కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. పోలీసులు, మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. నదిలో నీరు లేకపోతే లాంచీలకు ఏ విధంగా అనుమతిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చదరంగం, డ్రాయింగ్, క్రాఫ్ట్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రవీణ్ ఆధ్వర్యాన చదరంగం క్రీడలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ చదరంగం ఎంతో ప్రాచీనమైన ఆటని, రాజుల కాలం నుండి ఆడేవారని పేర్కొన్నారు. చదరంగం ముఖ్యంగా ప్రశాంత వాతావరణంలో ఆడాలన్నారు. అందువల్లే పూర్వం రాజులు ఏకాంతంగా ఆడేవారని పేర్కొన్నారు. చదరంగం అన్నీ వయసుల వారు ఆడవచ్చని, మెదడు చురుకుగా ఉండేలా చేస్తుందని పేర్కొన్నారు. మెరుగైన మెదడు పనితీరు, మెరుగైన జ్ఞాపకశక్తి అభిజ్ఞాన సామర్థ్యాలు, వ్యూహాత్మక ఆలోచనలు, శ్రద్ధ వంటి వాటి పెరుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఆడటం వలన ఏకాగ్రత పెరుగుతుందన్నారను. ఇంట్లోనే కూర్చుని ఇంటిల్లిపాదీ సరదాగా ఆడటంలో కూడా ఇది గొప్ప ఎంపికని పేర్కొన్నారు. ఎండా

కాలంలో ఇళ్ళల్లో కూర్చుని పిల్లల మెదడుకు చురుకుదనం తేవటంలో చదరంగం కి మించిది మరేదీ లేదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు చదరంగంలోని పద్ధతులు, ఆడే విధానం, నిబంధనల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో సాధన చేయించారు. అలాగే డ్రాయింగ్, క్రాఫ్ట్ కూడా నేర్పించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాదికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

7 వరకు 'చిత్తరంజన్'లో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో ఈనెల 15 నుండి జూన్ 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పుస్తకపఠనం, నీతి కథలు చెప్పించడం, జాతీయ నాయకుల చరిత్రలు చదివించి, పుస్తక సమీక్షలు నిర్వహించారు. 'నీకు నచ్చిన చిత్రం' అనే అంశంపై చిత్ర లేఖనం పోటీ నిర్వహించారు. అనంతరం రిటైర్డు లెక్చరర్ బి.సావిత్రి తెలుగు పద్యాలు, శ్లోకాలలో శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సుబ్బయ్య స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ దేశభక్తి గీతాలను నేర్పించారు. ఈసందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు పిల్లల్లో సజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. అక్షర రూపం దాల్చిన ఓ శిరా చుక్క

లక్ష మెదళ్ళ కదలికకు ప్రతి రూపం అవుతుందన్నారు. జూన్ 7వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు ప్రతి రోజూ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను పేరెంట్స్ ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపి కొనకళ్లకు గుండెపోటు

(మొదటి పేజీ తరువాయి)

కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో రాష్ట్ర విభజన సమయంలో ఢిల్లీలోని పార్లమెంట్లో మాట్లాడుతుండగా మొదటిసారిగా ఆయనకు గుండెపోటు వచ్చింది. మళ్లీ ఆయనకు గుండెపోటు రావడం ఇది రెండోసారి.

పలువురు టిడిపి నేతల పరామర్శ

విజయవాడలో చికిత్స పొందుతున్న ఆయనను మచిలీపట్నం సిట్టింగ్ ఎంపి వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, పెనమలూరు మాజీ ఎంఎల్ఎ బోడే ప్రసాద్ గురువారం పరామర్శించారు. నారాయణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనను పరామర్శించిన వారిలో టిడిపి చల్లపల్లి మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, యువ నాయకులు మండలి వెంకట్రామ్, సన్‌ఫ్లవర్ విద్యాసంస్థల అధినేత ఎండివిఎస్‌ఆర్.పున్నంరాజు, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నభీ ఘోరి తదితరులు ఉన్నారు.

పరామర్శిస్తున్న బుద్ధప్రసాద్ తదితరులు

మహారాజశ్రీ 14వ అదనపు జిల్లా కోర్టు & అదనపు ఫ్యామిలీ కోర్టు, విజయవాడ వారి కోర్టులో
జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 8/2024

బిట్వీన్ :
1. శ్రీమతి కొల్లిపర అనురాధ
2. కొల్లిపర చంద్రలిఖిత
3. కొల్లిపర వర్ణిత

(2, 3 వాదులు మైనర్లు అయినందున వారి తరఫున తల్లిగారైన1వ వాది ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.)
... వాదులు

మరియు

ఎవరునూ లేరు ... ప్రతివాదులు

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియచేయునది ఏమనగా, పైన తెల్పిన వాదులు పైన తెల్పిన కోర్టువారి ఎదుట ఈ క్రింద వివరించిన షెడ్యూలు ఆస్తిని ది. 30.12.2023న వ్రాసుకున్నటువంటి విక్రయ అగ్రిమెంట్ ప్రకారం శ్రీ కొల్లిపర రాధాకృష్ణమూర్తి గారికి విక్రయించుటకు మరియు విక్రయ ధనమును 2వ, 3వ వాదులు మైనర్లు అయినందున వారి పేరున ఫిక్సడ్ డిపాజిట్లు చేయుటకు కోర్టువారి అనుమతి కోరియున్నారు. కావున ఎవరికైననూ ఆక్షేపణలు ఉన్నయెడల ది. 13.06.2024న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ లేక న్యాయవాది ద్వారాగానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

ఐటం నెం.1 : కృష్ణాజిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ, శివాలయం వీధి, డి. నెం. 11-49-338 మరియు 11-49-386, పాత అసెస్మెంట్ నెం. 7085, ప్రస్తుత అసెస్మెంట్ నెం. 60572, ఎన్.టి.ఎస్. నెం. 78/2, బ్లాక్ నెం. 2, రెవెన్యూ వార్డు నెం. 7, మున్సిపల్ వార్డు నెం. 11/1 లో గల 67.5/9చ.గ॥లలో 1/15వ అవిభాజ్యపు వాటా క్రింద చ.గ॥ 4.506లు లేక 3-767 చ.మీ.ల విస్తీర్ణమునకు హద్దులు :
తూర్పు : మున్సిపల్ రోడ్డు, జెండా వీధి.
దక్షిణం : మున్సిపల్ రోడ్డు, శివాలయం వీధి.
పడమర : ఇతరుల ఆస్థి
ఉత్తరం : వాది మరియు సర్దార్ బేగం & అహ్మదున్నీసల మధ్య జాయింట్ గోడ

ఐటెం నెం. 2 : విజయవాడ, శివాలయం వీధి, డి.నెం. 11-49-336, అసెస్మెంట్ నెం. 1073024886, రెవెన్యూ వార్డు నెం. 39, సాయి బులియన్ కార్పొరేషన్ బిల్డింగ్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ యొక్క 138.6 చ.అ.ల ప్లింత్ ఏరియాకు హద్దులు:
తూర్పు : సుల్తాన్ మొహియుద్దీన్ జిలానీ సాహెబ్ గారి వల్ల రీజెంట్ ట్రేడర్స్ వారు అద్దెకు తీసుకున్న ఆస్తికినీ, వాది యొక్క మధ్యగల జాయింట్‌గోడ
దక్షిణం : మున్సిపల్ రోడ్డు, శివాలయం వీధి.
పడమర : వాది మరియు మామిడిపాక రామకృష్ణారావు మధ్య జాయింట్ గోడ.
ఉత్తరం:సుల్తాన్ మొహిద్దీన్ జిలాని సాహెబ్ గారి ఆస్తి.

వాయిదా తేది : 13-06-2024.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

విజయవాడ,
14-05-2024.

శ్రీ చిలువేరు మార్కండేయ, బి.ఎ.,ఎల్.ఎల్.ఎం.,
శ్రీమతి చిలువేరు మాధవి, బి.ఎ.,ఎల్.ఎల్.ఎం.,
వారి తరఫు న్యాయవాదులు, విజయవాడ.
సెల్ : **94405 24224, 94417 48224.**

సీపెట్ భవన సముదాయం

ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ రంగంలో విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందిస్తోంది మండలంలోని సూరంపల్లిలో ఉన్న సెంట్రల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) సంస్థ. 2015 నుంచి గడిచిన ఎనిమిదేళ్లలో 700 మంది విద్యార్థులు ఈ విద్యను అభ్యసించారు. అంతేగాక ఇదే సంస్థలో నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నైపుణ్యాభివద్ధి శిక్షణ ఇస్తూ 3,300 మందికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పించిన ఘనత సీపెట్ కు ఉంది.

కొలువు.. చాలా సులువు

- 'సీపెట్' విద్యతో మెరుగైన ఉద్యోగావకాశాలు
- విద్యార్థుల నైపుణ్యం పెంపునకు పెద్ద పీట
- పదో తరగతి విద్యార్హతతో ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ కోర్సులు
- డిప్లొమాతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమాకు అవకాశం

ప్రజాశక్తి-గన్నవరం

సీపెట్ లో లభిస్తున్న కోర్సులు..

పదో తరగతి విద్యార్హతతో 3సంవత్సరాలు చదివే డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్(డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ ఉత్తీర్ణులైన వారికి రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్స్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసె సింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ పీపీటీ) కోర్సును అందిస్తోంది.

ఫీజు రీయింబర్స్మెంట్ సదుపాయం..

ఆయా కోర్సులకు ఏపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ అందిస్తోంది. వీటిలో చేరడానికి అఖిల భారత స్థాయిలో ఏటా నోటిఫికేషన్ ను ఏప్రిల్ నెలలో విడుదల చేస్తారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జూలైలో జరుగుతుంది. దీనిలో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీపెట్ లో 150 సీట్లు భర్తీ చేశారు. దీనిలో చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి.

నైపుణ్యాభివద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు..

10వ తరగతి విద్యార్హత, 18 నుంచి 45 సంవత్స రాలు వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జనరల్ యువతకు జాతీయ సంస్థలు సౌజన్యంతో, సీఎస్ ఆర్ కార్యాచరణలతో మూడు నెలల నుంచి ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

భవిష్యత్తు భరోసా ఇచ్చింది..నానితా,

సూరంపల్లి సీపెట్‌లో చదువుకుని హైదరాబాద్లో ఉద్యోగం చేస్తున్నా. 10వ తరగతి పాస్ అయిన తర్వాత సీపెట్ లో జాయిన్ అయ్యా. మూడు సంవ త్సరాల డిప్లొమా పూర్తి చేశా. అనంతరం సీపెట్ ద్వారానే ఉద్యోగ అవ కాశం లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని రిలీసిస్ కంపెనీలో పని చేస్తున్నా. రూ.20వేలు జీతం తీసుకుంటున్నా. భవిష్యత్తు సీపెట్ భరోసా ఇచ్చింది.

సిపెట్ లక్ష్యం ఇదే..శేఖర్,డైరెక్టర్,

సూరంపల్లిలోని సీపెట్ కళాశాల ఇండస్ట్రీ వాతావరణంలో స్కిల్స్ లైవ్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నాం. క్యాంపస్లోనే వసతి. భోజనం ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా, నైపుణ్యాభివ ద్ధి కోర్సులు చదివిన వారు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంతేగాక సొంతంగా ఇండస్ట్రీలను స్థాపిస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులు

పమిడిముక్కల గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రంథాలయాలు నడిచే దేవాలయాలని, విద్యార్థులు వేసవికాలంలో గ్రంథాలయాలు వినియోగించుకోవాలని పమిడిముక్కల గ్రంథాలయ శాఖ కార్యదర్శి షరీఫ్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం, గురజాడ, మేడూరు, పెనుమత్స గ్రంథాలయాల్లో వేసవి కాలపు శిక్షణా తరగతులు ప్రారంభించారు. అగ్నిపర్వలో బొబ్బలావణ్య, పమిడిముక్కలలో షరీఫ్, మేడూరులో సుబ్బారావులలో శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంధాలయ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖర రావు అన్నారు. పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకుల ఆదేశానుసారం మండల కేంద్రంలోని ఉంగుటూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుండి వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లలకు పుస్తక పఠనం, నీతి కథలు చెప్పించడం, పుస్తక సమీక్షలు క్యారమ్స్ ఆటలు నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లల్లో సజనాత్మకతను పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి 11.30 వరకు నిర్వహిస్తారమని, తల్లితండ్రుల పిల్లలను పాల్గొనేలా చూడాలని కోరారు.

అంకమ్మ అమ్మవారిని దర్శించుకున్న మండలి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ అమ్మవారిని, అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ , శీలం అశ్విన్ లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. అంకమ్మ అమ్మవారి తొమ్మిదవ వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా గురువారం ఉదయం బుద్ధ ప్రసాద్ దంపతులు ఆలయానికి విచ్చేసి స్వయంగా అమ్మవారికి పంచామత అభిషేకములు నిర్వహించారు. అనంతరం చండీ హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రాలతో బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదములు అందించారు. ఆలయ అర్చకులు బాల జగన్నాథ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోప్పలపూడి గంగాభవాని, కోనేరునాగేశ్వరరావు ,దోప్పలపూడి జగదీష్, కోనేరు సౌమ్య ,రావి రత్నగిరి కోనేరు నాని, బలరామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవ భవనం నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానికొండ సుధారాణి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 100 మంది వద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి చలసాని శ్రీధర్, కోశాధికారి పెరుమాళ్ , డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వైబిసి ప్రసాద్, లయన్ జంగం మోహన్ రావు లయన్ నిమ్మగడ్డ శశికళ మరియు ఇతర లైన్స్ సభ్యులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో గంగానమ్మ జాతర

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కూరాడ గ్రామంలో గంగానమ్మ పెద్ద జాతర కార్యక్రమాలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. ఈనెల 15న ప్రారంభమైన ఈ జాతర మహోత్సవాలు ఆరు రోజులపాటు ఘనంగా జరగ నున్నాయి. ఈసందర్భంగా ప్రతిరోజు గ్రామంలో పోతురాజు గెడ ఘటం కుండలను ఊరేగిస్తారు. చివరి రోజు ఆదివారంనాడు ఐదువేల మందికి పైగా అన్న సమారాధన నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం నుంచి కొర్ల అంకమ్మ తల్లిని పొలిమేర వరకు సాగనంపనున్నారు. ఈ జాతర మహోత్సవానికి పెద్ద కథే ఉంది. 1933 వ సంవత్సరం వరకు ఈ ఆనవాయితీ కొనసాగింది.ఆ తర్వాత ఎవరూ కూడా ఈ జాతర మహోత్సవం నిర్వహించలేదు. 2019 సంవత్సరంలో గ్రామానికి చెందిన మహారెడ్డి సూర్యనారాయణ ఈ విషయమై కూపిలాగి సంబరాలు జరిపేందుకు విశేష కషి చేశారు. అప్పటికి అమ్మవారి సంబరాలు జరిగి 86 సంవత్సరాలు అవుతుంది. సూర్యనారాయణ జోక్యంతో జాతర మహోత్సవం మళ్లీ ప్రాణం పోసుకుంది. అనుకున్నదే తడవుగా అన్ని సామాజిక వర్గాలను సమీకరించి కమిటీ ఏర్పాటు చేశారు. 2019 సంవత్సరంలో ఘనంగా జాతర మహోత్సవాలను నిర్వహించగా అనంతరం సూర్యనారాయణ దివంగతుతులయ్యారు. ప్రస్తుతం ఆ సంబరాలను కమిటీ సభ్యులు భుజాన వేసుకుని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా గౌరీ వీర వెంకటరత్నరావు చిలకుర్తి రాంప్రసాద్ మాదాసు ప్రసాద్ మహారెడ్డి మురళీకష్ణ రావు దండుబోయిన శ్రీనివాసరావు మద్దాల నాని శాఖమూరి సుబ్బారావు లు వ్యవహరి స్తున్నారు. ఈ ఆరు రోజులపాటు గ్రామం వేలాది మంది బంధుమిత్రులతో సందడి సందడిగా మారనుంది.

గెలుపోటములపై బెట్టింగుల జోరు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.? మ్యాజిక్ మార్క్ ఎవరు దాటుతారు? పిఠాపురం, మంగళగిరి, జిల్లాలో ఎవరు ఎక్కువ స్థానాలు గెలుస్తారు.. కడప ఎంపీ విజేత ఎవరు? ఎవరికి ఎంతెంత మెజారిటీ వస్తుంది?అన్నఅంశాలే ప్రాతిపదికగా గన్నవరంలో పందాల రాయుళ్లు లక్ష పందెం కాస్తే రూ.2 లక్షల ఇచ్చేలా పందేలు వేస్తు న్నారు. పందెం రాయుళ్లు ముఖ్యంగా ఆరు కేటగిరీల్లో పందేలు కాస్తున్నారు. అభ్యర్థుల అనుచరులు, కీలక నేతలు, కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు పోలింగ్ ముగిసిన మరుక్షణం నుంచి ఇదే పనిలో తలమునకలైయ్యారు. ఏ నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు? గెలిచిన అభ్యర్థికి ఎంత ఆధిక్యం? కీలక నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తోంది? ఎక్కువ సీట్లుఎవరు సాధిస్తారు? ఏ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుంది? అన్న అంశాలపై జోరుగా పందేలు సాగుతున్నాయి. కార్యకర్తల స్థాయిలో లక్షల్లో పందేలు వేస్తుంటే, నాయకుల స్థాయిలో కోట్లలో బెట్టింగ్ చేస్తున్నారు. కష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో ఎటు చూసినా బెట్టింగ్ చర్చలే నడుస్తున్నాయి. పందేలపై ఆసక్తి ఉన్నవాళ్లు వివిధ సర్వే సంస్థల అంచనాలు, లెక్కలను పరిగణనలోకి తీసుకుని బెట్టింగ్‌ల్లో వాలిపోతున్నారు. కొంతమంది భూములను బెట్టింగ్‌ల్లో పెట్టడం గమనార్హం. రాష్టంలో ఈసారి పోలింగ్ శాతం బాగా పెరగడంతో ఎక్కడ చూసినా ఇదే సీన్ కనిపిస్తోంది. సంక్రాంతి సమయంలో కోడిపందేల తరహాలో ఈ బెట్టింగ్స్ సాగు తున్నాయి. 1:5 రేషియోలో పందేలు వేస్తున్నారు.

బెట్టింగ్ సీట్స్ ఇవే: జోరుగా పందేలు సాగుతున్న టాప్ 10 అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాలో మంగళగిరి, పిఠాపురం, గుడివాడ, గన్న వరం, ఉండి, ధర్మవరం, కాకినాడ సిటీ, రాజోలు, విజయవాడ తూర్పు, నగరి ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో నెల్లూరు రూరల్, దర్శి, చీరాల, గుంటూరు వెస్ట్, విజయవాడ సెంట్రల్, రాజానగరం, రాజమ హేంద్రవరం, విశాఖపట్నం ఈస్ట్, అవనిగడ్డ, మచిలీ పట్నం, సత్తెనపల్లి, గురజాల, ఆళ్లగడ్డ, నందిగామ, మైలవరం, పోలవరం నియోజకవర్గాల్లో టీడీపీ-వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపోటములపై లక్షల రూపాయల పందేలు కాస్తున్నారు. పిఠాపురంలోపవన్ కల్యాణ్ 50 వేలకు పైగా మెజారిటీ సాధిస్తారని కాకి నాడకు చెందిన ఒక వ్యాపారి రెండున్నర కోట్ల రూపా యలు దళారి వద్ద ఉంచినట్టు తెలుస్తోంది. ఉండి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి రఘురామకష్ణరాజు విజయంపై 1:2 లెక్కన బెట్టింగ్ సాగుతోంది. కుప్పంలో చంద్రబాబు మెజారిటీ తగ్గుతుందని ఒకరు పందెం పెడితే, గతంలో కంటే పెరుగుతుందని మరికొందరు బెట్టింగ్ కాస్తున్నారు. పులివెందులలో జగన్ మోహన్ రెడ్డి రికార్డు మెజారిటీలపై 1:3 చొప్పున పందేలు సాగుతున్నాయి. భీమవరం ,కడప, విజయవాడ, ఏలూరు బెట్టింగ్ బ్యాచ్‌లు సొంతంగా సర్వేలు చేసుకుని వాటి ఆధారంగా సత్తా మార్కెట్‌లో ట్రెండ్స్ నడుపుతున్నాయి. ఈ బెట్టింగుల కోసం కార్లు వేసుకొని గ్రామాల్లో తిరుగుతున్నారు. మీడియేటర్లను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఓ వ్యక్తి కారులో 50 లక్షల రూపాయలు పెట్టుకుని పందాల కోసం గన్న వరం రావడం, పందాలు కాసేవారితో చర్చిం చడం జరుగుతోంది.

విద్యలో మేటి 'లిటిల్ ఫ్లవర్'

ప్రజాశక్తి-మైలవరం
లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ కళాశాల మైలవరం మండలంలో విద్యలో మేటిగా విజయాల్లో ఘణాపాటిగా నిలుస్తుంది. 1979లో ప్రారంభించబడిన ఈ సంస్థ సుమారు 45 సంవత్సరాల నుండి మైలవరం నియోజకవర్గంలో వేల సంఖ్యలో విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన సంస్థగా గుర్తింపు పొందింది. మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత లిటిల్ ఫ్లవర్‌కే దక్కుతుంది. వందల సంఖ్యలో విద్యార్థులు విదేశాలలో ఉద్యోగాలు పొందినవారు ఉన్నారు. ఈ ప్రాంతంలో మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలగా, కళాశాలగా గుర్తింపు పొందింది. నాటి నుండి నేటి వరకు విద్యలో, విజయాలతో దూసుకుపోతోంది. 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాలలో వంద శాతం ఫలితాలు సాధించిన ఘనత లిటిల్ ఫ్లవర్ విద్యార్థులది.

ఇంటర్ ఫలితాల్లో 95 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎల్ఎఫ్ కాలేజ్ టాపర్ వి.తబిత ఎంపీసీ 889, టి.సుజిత సిఇసి 855, భవానీ బైపిసి 852 మార్కులు సాధించారు.

క్రమశిక్షణతో క్లాసులు నిర్వహణ

ప్రత్యేక తరగతులు, రెగ్యులర్ టెస్టులు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో బోధన, కంప్యూటర్ తరగతులు, ల్యాబ్స్ నిర్వహణ, విశాలమైన క్రీడా ప్రాంగణం ఎల్‌కెజి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు వారి స్థాయిలలో క్రీడలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. రెగ్యులర్ స్టడీ అవర్స్ నిర్వహణ వల్లే లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అండ్ జూనియర్ కళాశాల విజయవంతంగా నడుస్తుందని కరస్పాండెంట్ మత్తై మార్గరెట్ తెలిపారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో గురువారం సమ్మర్ క్యాంప్ శిక్షణలో భాగంగా విద్యార్థులు పుస్తక పఠనం చేశారు . కథలు, కవితలు నేర్పించారు. పాటలు డాన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు డ్రాయింగ్ నేర్పారు. యోగా మాస్టర్ ఎమ్.మల్లికార్జునరావు యోగా నేర్పారు. అనంతరం మ్యూజికల్ ఛైర్స్, ఆటలు పోటీలు నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ లో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

'జంగాపై వేటు అనైతికం'

ప్రజాశక్తి-నందిగామ: శాసనమండలి సభ్యుడు జంగా కష్ణమూర్తి యాదవ్ పై అనర్హత వేటు వేయటం బీసీ జాతిని వైసిపి అణగదొక్కుతుందని మరో నిదర్శనమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇంచార్జ్ యలాగల నూకనమ్మ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీసీ జాతి, యాదవ సామాజివర్గం జగన్మోహన్ రెడ్డికి ఓటు వేయలేదు అన్న ఉద్దేశంతో బీసీలను రాజకీయంగా గొంతు కోసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

విలేకరిపై దాడికి ఖండన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 13న పోలింగ్ రోజు టీవీ5 రిపోర్టర్ రాజాపై పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అనుచరులు దాడి చేశారు. దాడిని ఖండిస్తూ గురువారం తాహసిల్దార్ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టీ.ఎల్.ఎన్ ఆచార్యులు, సీనియర్ రిపోర్టర్లు సైదేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏ శివాజీ, కాకనబోయిన శివరామకృష్ణ, ప్రసాద్, నజీర్, బి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ మజ్జిగ, మంచినీరు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవర ప్పాడు తండా గ్రామంలో రాంకో సిమెంట్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) లో భాగంగా గ్రామంలో ప్రజలకు మజ్జిగ మరియు మంచినీళ్లు ప్రతిరోజు వేసవికాలం ముగిసేంతవరకు పంపిణీ చేయు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా జయంతిపురం గిరిజన మహిళలకు (లంబాడి డ్రెస్) సుమారు 15 మందికి 75 వేల రూపాయల విలువ గల సంప్రదాయ డ్రస్సులను కంపెనీ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వర్క్స్ మూర్తి రావు, జిఎం అకౌంట్స్ మరియు అడ్మినిస్ట్రేషన్ ఫరూక్ మహమ్మద్, సీనియర్ డి.జిఎం.హెచ్.ఆర్ ఎం.రామకష్ణ సాయి, గ్రామ సర్పంచ్ గుగులోతు మణి, హెచ్ ఓ డి మరియు యూనియన్ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేదాద్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామములో కృష్ణానది తీరమున ప్రసిద్ధ పుణ్య క్షేత్రము స్వయంభూ శ్రీ పంచనారసింహ క్షేత్రమై వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో వంశపారంపర్య ధర్మకర్త శ్రీమతి డాక్టర్ వి ఎల్ ఇందిరాదత్తు ఆధ్వర్యములో ఈ నెల 18 నుండి 25 వరకు అంగరంగ వైభవముగా శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములు జరుగుతాయని దేవస్థాన కార్యనిర్వాహణాధికారిణి శిరపరపు హేమలత దేవి తెలిపారు. కళ్యాణ పత్రిక మరియు వాల్ పోస్టర్లను కె సి పి ప్రతినిధి రామ్ ప్రసాద్ సమక్షములో ఆవిష్కరించారు. శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములలో భాగంగా ఈ నెల 22 రాత్రి 12 గంటలకు శ్రీ స్వామి వారి కళ్యాణమునకు విచ్చేయు భక్తులకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి కల్పించవలసిన సౌకర్యముల గురించి నందిగామ రెవెన్యు డివిజనల్ అధికారి ఆదేశముల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలతో ఈ నెల 17 మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన కార్యాలయములో సమన్వయ సమావేశము ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. దేవస్థానము కార్యాలయము గురువారం నిర్వహించిన భూముల కౌలు బహిరంగ వేలము పాటలు యందు, తలనీలాలు ప్రోగుచేసుకొను లైసెన్సుకు, టెంటు, షామియానా లైసెన్సుకు వేలము పాటలు యందు, టెండర్లు నందు ఎవరు పాల్గొనని కారణంగా వాయిదా వేయుటమైనదని దేవస్థాన కార్యనిర్వాహణాధికారిణి తెలిపారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంధాలయ సంచాలకుల వారి ఆదేశాల మేరకు ఈ 16 నుండి జూన్ 7 వరకు పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గురువారం ఉదయం 8గంటలనుండి 12 గంటలవరకు విద్యార్థులచే పుస్తక పఠనం, కథల పుస్తకాలతో దేశానాయకుల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా పెనుగంచిప్రోలు మండలం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ పాల్గొన్నారు. ఉపాద్యాయురాలు శ్రీమతి రేణుక జనరల్ సైన్సులో విద్యార్థులకు ఉపయోగపడే విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాలలో విద్యార్థులు ప్రతిరోజు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంధాలయ అధికారిణి శ్రీమతి ఆలేటి ప్రభ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది జె.శ్యామల, రమేష, సత్యావతి పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-విసన్నపేట: విస్సన్నపేట మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మీ పచ్చి రొట్ట విత్తనముల నమోదు మరియు ప్రయోజనములపై గురువారం దిశానిర్దేశం చేశారు. 50 శాతం రాయితీ పై అందుబాటులో రాబోయే పచ్చిరొట్ట పైర్లు సాగు యొక్క ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న రైతుల వివరాలు నమోదు చేయవలసిందిగా ఆదేశించారు. పచ్చిరొట్ట పైర్లు సాగువలన నత్రజని ఎరువుల వాడకాన్ని 25-30 శాతం వరకు తగ్గించవచ్చని, నేల నీటి నిల్వ సామర్థ్యం వద్ధి చెందడంతో పాటు నేల కోతను కూడా అరికడుతూ, భూమి గుల్లబారి నేల సారవంతం అవుతుందని తెలియజేసారు. చౌడు భూములలో చౌడు సమస్యను తొలిగించడంతో పాటు భూసార పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా వరి సాగు చేసే ప్రాంతాలలో వరి పంట ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వలన బియ్యంలో విటమిన్లు, మాంసకత్తుల శాతం పెరిగినట్లు పరిశోధనా ఫలితాలలో వెల్లడైంది. దిగుబడి కూడా దాదాపు 15-20 శాతం పెరుగుతుందని రుజువైంది. అందువలన రైతులు పచ్చిరొట్ట పైర్లైన జిలుగు, పిల్లిపెసర మరియు జనుములను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రం వద్దకు ఆధార్, పాస్ పుస్తకంతో వ్యవసాయ/ఉద్యాన సహాయకులను సంప్రందించవలసిందిగా ఎ.ఒ రాజ్యలక్ష్మీ తెలిపారు.

దోమలు బాబోయ్... దోమలు

రోడ్డుపైనే పారుతున్న మురుగు

ప్రజాశక్తి - గన్నవరం

వర్షాలు పడటం మొదలైందో లేదో దోమలు దాడి పెరిగిపోయింది. దోమలు బాబోయ్.. దోమలు.. అవి కుడితే జ్వరాలు. డెంగీ వస్తే పోతున్న ప్రాణాలు, మందులు కొడుతున్నా చావని దోమలు..అవి కుడితే చనిపోతున్న జనాలు. ఇదీ గన్నవరం మండలంలో ప్రజల నుంచి వినిపిస్తున్న వేదన. కాలంతో పని లేదు. దోమలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దాడులు చేసి జనాలను ఆసుపత్రుల పాల్జేస్తున్నాయి. దోమలపై దండయాత్రలు చేస్తే అవి చావలేదు కదా పెరిగిపోయి జనాలపై దాడులు పెంచాయి. దీంతో ఏ ఇంట్లో చూసినా జ్వరాలతో ఇబ్బంద లు పడుతున్నారు. పల్లెల్లో దోమలు విజంభించడంతో జనాలు రోగాలతో అల్లాడుతు న్నారు. పారిశుద్ధ సత్యం అస్తవ్యస్తంగా ఉండటమే కారణం. చెత్తకాల్వల్లో వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారుతోంది. దీంతో దోమలు పెరిగి జనాలపై దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గన్నవరం పట్టణంలో కనీసం పాగింగ్ చేయడం లేదంటున్నారు. పట్టణంలోని చెంచులకాలనీ, గౌడపేట, ముస్లింపేట, దళితవాడతో పాటు శ్రీనగర్ కాలనీలో మ ఎరుగు నిలిచిపోతుంది. దోమలకు నిలయంగా మారాయని నివాశితులు తెలిపారు. విష జ్వరాలు అధికంగా రావడంతో ఆసుపత్రుల్లో రోగులు పెరుగుతు న్నారు. మలేరియా, డెంగ్యూ వస్తుందని జనాలు బ యపడుతున్నారు. కేసరపల్లిలో డ్రైయిన్లలో పూడికలు తీయడం లేదు. అజ్జంపూడి, బిబిగూడెం, చిన ఆ వుటపల్లి, ముస్తాబాద్, సూరంపల్లి పంచాయతీల్లో డ్రైయిన్లు పారడం లేదు. మురుగుతో దోమలు ఉత్పత్తి పెరిగి విజంభిస్తున్నాయని జనాలు తెలిపారు. ఇప్పటికే జ్వరాలతో బాధలు పడుతున్నామని చెప్పారు. ముస్తాబాద, గన్నవరం ఆసుపత్రుల్లోజ్వరాల రోగల సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ లాంటిది వస్తే చికిత్సలు చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. విజయవాడ లాంటి ఆసుపత్రికి రోగులను తరలించాల్సి వస్తుంది.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఉపకులపతి జ్ఞానమణి

ఎపిఇఎపి సెట్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : ఎపిఇఎపి సెట్ పరీక్షా కేంద్రాలను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పరిశీలించారు. ఎపిఇఎపి సెట్ తొలిరోజు గురువారం మచిలీపట్నం ఎస్విహెచ్ ఇంజినీరింగ్ కళాశాల, పెడన వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశా రు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాలు మేరకు ఎంసెట్ పరీక్ష కేంద్రాలను ఉపకులపతి పరిశీలించారు. తొలిరోజు అగ్రి కల్చర్, ఫార్మసీ విభాగాలకు సంబంధించిన విద్యార్థులు హాజరయ్యారు.

సబ్సిడీ పై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి గూడూరు : గూడూరు మండలం లో రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీ పై పచ్చి రొట్ట విత్తనాలు విక్రయానికై ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయ అధికారి జి వి శివప్రసాద్ తెలిపారు. ఖరీఫ్ మొదలుకు ముందే వరి పండించే భూముల్లో పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేసి కలియ దున్నటం వలన భూమిలో సేంద్రియ పదార్థాలు తయారయ్యి ఎరువుల వాడకం తగ్గుతుందని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు. జీలుగ, జనుము 10 కేజీల బ్యాగ్ 440 రూపాయలు గాను, పిల్లిపెసర 10 కేజిల బ్యాగ్ 670 రూపాయలు గా ధర గా నిర్యయించామన్నారు.ఎకరానికి 10 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు రైతులు తన పాస్ పుస్తకం, ఆధార్ జీరాక్స్‌తో రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

గ్రౌండ్‌లో గ్రావెల్ తొక్కిస్తున్న దృశ్యం

క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం క్రీడా మైదానం అభివద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఆర్ కిషోర్ తెలిపారు. వాకింగ్ ట్రాక్‌పై దుమ్ము లేవకుండా ట్రాక్టర్ తో నీరు చల్లిస్తున్నారు. క్రీడ మైదానంలో గోతులను పూడ్చేందుకు మట్టి తోలించారు. రోడ్డు రోలర్‌తో అంతా చదును చేయిస్తున్నారు. గంగానమ్మ చెట్టు టైల్స్ నిర్మిస్తున్నారు. తన సొంత నిధులు ఖర్చు పెట్టి పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. దాతల సహకారం కూడా తీసుకుంటామన్నారు. మినీ జిమ్ ఏర్పాటుకు కషి చేస్తున్నట్లు తెలిపారు.

టిబి నివారణ టీకా ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల : రాష్ట్రంలో 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో టీబీ నివారణ టీకా కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా ఘంటసాల మండలం ఘంటసాల పాలెం సచివాలయం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో అర్హులైన వారికి టీబీ నివారణకు బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. 18 సంవత్సరాల పైబడి గత ఐదు సంవత్సరాల క్రితం టీబీకి సంబంధించిన మందులు వాడిన వారికి, టీబీ వ్యాధిగ్రస్తులతో నివాసం ఉన్నవారికి, 60 సంవత్సరాలు పై బడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగత్రాగే వారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే (బరువు) తక్కువ ఉన్న వారికి ఈ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ టీకాలు ప్రతి గురువారం మూడు నెలల పాటు ఆరోగ్య ఉపకేంద్రం నందు వేస్తారని ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. కాగా ఒక్కో సచివాలయం పరిధిలో 100 మందికి బీసీజీ టీకా వేయాల్సి ఉండగా ఘంటసాలపాలెం ఆరోగ్య ఉపకేంద్రం నందు ఇప్పటి వరకు 50 మందికి టీబీ

టీకాలు వేస్తున్న దృశ్యం

నివారణ టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. ఘంటసాలపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఘంటసాలపాలెం, మల్లంపల్లి, లంకపల్లి, యండకుదురు సచివాలయాల పరిధిలో 172 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు డాక్టర్ నిఖిత ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల పాలెం పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ యూ.నిఖిత ప్రసాద్, ఎంపీహెచ్ఈవో పీబీ భాస్కరరావు, ఎఎన్ఎం జి.సునీత, కె.లత, పి.జయశ్రీ, జె.నాగరోజా, కె.జ్యోతిర్లత, సూపర వైజర్లు బి.శారదా, బి.నాగేంద్రరావు, కె.విజయదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలి

మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానదిలో భారీ మిషన్లతో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఘంటసాల మండల జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం శ్రీకాకుళంలో గ్రామంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు సుగున పవన్ కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం గ్రామంలోని కష్ణానది నుంచి భారీగా వందలాది టిప్పర్లతో ఇసుక రవాణా జరుగుతుందని తెలిపారు. అనుమతులు ఉన్నాయని చెబుతున్న నిర్వాహకులు భారీ మిషన్లతో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్వయంగా వారే చెబుతున్నారన్నారు. అనుమతులు లేనప్పుడు మిషన్లకు ఎవరు పర్మిషన్ ఇచ్చారో, ఎందుకు తవ్వుతున్నారో తెలపాలన్నారు. లోతుగా తవ్వకాలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపో తున్నాయన్నారు. కొందరు స్వార్థం కోసం చేసే పనులతో శ్రీకాకుళం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మండల స్థాయి అధికారులు క్వారీలో భారీ మిషన్ల తవ్వకాలు తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బాగా లోతుగా తవ్వకాలు చేపట్టడంతో ఇటీవల నదీలో స్నానానికి వెళ్లి ఒక వ్యక్తి చనిపోయారని, మూగ జీవాలు సైతం లోతుగా తవ్వకాలు చేయటం ద్వారా నదీలోకి వెళ్లి చనిపోతున్నాయని తెలిపారు. గతంలో అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే ఇసుక, బుసక తవ్వకాలు చేపట్టారని, ఇప్పుడు కూడా అనుమతుల పేరుతో మిషన్లతో తవ్వకాలు చేపడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మనుషుల చేత మాత్రమే లోడింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. యంత్రాలు ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. తవ్వకాలు నిలుపుదల చేయకపోతే క్వారీలో జరుగుతున్న ఈ ప్రక్రియను అడ్డుకుంటామని అధికారులకు పత్రికా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండవీటి శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు కొండవీటి సూర్య పవన్ కుమార్ (నాని), కొప్పరాతి బాబు, కొండవీటి మున్నా, కొండవీటి సాయి, కొండవీటి తేజ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు : ఎండిఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వరరావు కోరారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా గ్రామాల్లో మంచినీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంది కావున అలాంటి సమస్య తలెత్తుకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే వంటకాలలో తోడు, గుర్రపు డెక్కపూడికతీత పనులు ఇరిగేషన్ అధికారులు చేపట్టాలని కోరారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారి యొక్క నిర్వహణ నివేదికలను సమర్పించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామంలోని వివిధ సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలు తాసిల్దార్ సునీల్, వైస్ ఎంపీపీ సాయన రవికుమార్, ఎంఈఓ1 జగన్మోహన్రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమాల వేదికగా మానికొండ భవన్

- 19న మానికొండ సుబ్బారావు గ్రంథాలయం, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక వేదిక ప్రారంభం
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక 22వ డివిజన్ భ్రమరాంభపురంలో పున:నిర్మాణ పనులు ముగించుకున్న మానికొండ సుబ్బారావు గ్రంథాలయం, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక వేదిక ఈ నెల 19వ తేదీ (ఆదివారం)న ప్రారంభంకానున్నది. భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చిగురుపాటి బాబూరావు, మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పుప్పాల కృష్ణ, సిపిఎం తూర్పు నగర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు, మానికొండ సుబ్బారావు గ్రంథాలయ కమిటీ కన్వీనర్ బత్తుల చిన్నారావు హాజరుకానున్నట్లు మానికొండ సుబ్బారావు గ్రంథాలయ కమిటీ సభ్యులు తాతా సాంబయ్య, కాయల లక్ష్మణ, వాజా శ్రీనివాసరావు, టి తాండవకృష్ణ, కాయలకుమారి తెలిపారు. సేవా, సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా డివిజన్‌లో సమస్యలను పరిష్కరించుకునేందుకు పరిష్కార వేదికగా మానికొండ భవన్ పని చేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. 22వ డివిజన్ నుంచి మేయర్, డిప్యూటీ మేయర్‌లను అందించిన ఘనత పార్టీకి దక్కుతుందన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో డ్రైనేజి, రోడ్లు, వీధిలైట్లు, అనేక మౌలిక సదుపాయాల కల్పనకు పార్టీ విశేష కృషి చేసిందన్నారు. డివిజన్‌లోని ప్రతి కుటుంబం మానికొండ భవన్‌తో ప్రత్యక్ష సంబంధాన్ని కల్గి, పార్టీ శ్రేణులతో మమేకమయిన పరిస్థితి ఉందన్నారు. అటువంటి ఉద్యమ కేంద్రం అయిన మానికొండ భవన్ శిధిలావస్థకు చేరిన నేపధ్యంలో దాతల సాయంతో పున:నిర్మాణం చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు.డివిజన్ సమస్యల ప్రత్యక్ష పోరాటాల వేదికగా, ప్రజల కోసం సేవా, సాంస్కృతిక కార్యక్రమాల వేదికగా రానున్న కాలంలో పని చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజన్‌లో పార్టీ నాయకులు డివిజన్‌లో గురువారం విస్తృతంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన మానికొండ భవన్

ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

ఓటింగ్ పెరుగుదలకు పథకాలే కారణం : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ లో ఈసారి మహిళా చైతన్యం వెల్లివిరిసిందని.. పోలింగ్ ప్రక్రియలో అతివలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే, వైసీపీ నగర అధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో ఆడపడుచులకు తగిన ప్రాధాన్యమిచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు అతివలందరూ ముందుకొచ్చారని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ పురుషులతో పోలిస్తే.. మహిళా ప్రభంజనం కనిపించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈవీఎంలు మొరాయించినా, ఎండలు తీవ్రత అధికంగా ఉన్నా, పలుచోట్ల వర్షం కురిసినా.. మహిళలు మాత్రం చెక్కుచెదరకుండా రాత్రి వరకు క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చారన్నారు. సార్వత్రిక ఎన్నికలలో నిర్ణయాత్మక శక్తిగా మహిళా ఓటింగ్ మారిన తీరు చూస్తే.. సంక్షేమ పథకాలే పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేయించాయనడంలో ఎటువంటి సందేహం లేదని మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలన్నింటినీ దాదాపుగా 'మహిళా' కేంద్రంగానే అమలు చేసిందన్నారు. నవరత్నాల పథకాలలో మహిళలకు సంబంధించిన పథకాలే ఎక్కువగా ఉండటంతో.. వారంతా వైసీపీ వైపే మొగ్గు చూపారన్నారు.

నందిగామలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ డివిఆర్ కాలనీలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్న తరవాత గ్రామాలలో ప్రజల ఇబ్బంది పడకుండా మంచి వాతావరణంలో ఉండాలని పోలీసులు కోరారు. ఎటువంటి రాజకీయ పార్టీలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా పోలీస్ వారు ఉన్నారని తెలిపారు. ఎన్నికలకు స్పెషల్ ఇంచార్జ్ విజయవాడ సిసిఎస్ ఏ సి పి ప్రశాంతిరాయ్ అధ్వర్యంలో నందిగామ టౌన్ ఇన్స్పెక్టర్ హనీష్, ఎస్సై పండుదొర, ఎస్సై దుర్గమహేశ్వరరావు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

నికాన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-విజయవాడ: ఫొటోలు లేని న్యూస్ పేపర్ వెలుగు ఇవ్వని దివిటి లాంటిదని ఒకే ఒక చాయచిత్రం వేయి పదాల అర్థాన్నిస్తుందని ఫోటో జర్నలిస్టు తీసిన చిత్రం ప్రచరించబడి ఎన్నో జీవితాలలో మార్పు తీసుకువచ్చిన సంఘటనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు .జిల్లా సమాచార శాఖకు మంజూరు చేసిన నికాన్ డీ850 మోడల్ కెమెరాను గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆయన కార్యాలయంలో సమాచార శాఖ అధికారులకు అంద జేశారు .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఒక ఫోటోతో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుత శక్తి ఒక్క ఫోటోగ్రఫీకే ఉంటుందన్నారు. మానవ జీవితానికి ఫోటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో మధుర స్మృతులను పదిలంగా ఉంచగల శక్తి ఫోటోలకే ఉంటుందన్నారు. ప్రజలఆలోచన సరళికి పదునుపెట్టి ఓర్పు, నేర్పుతో తీసిన ఫోటోలు పత్రికలో ప్రచురించడంద్వారా ఎన్నో జీవితాలలో వెలుగులు నింపిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయడంలో ప్రధాన భూమిక పోషించే సమాచార శాఖ లో ఫోటోగ్రఫి పాత్ర కీలకం అన్నారు . అత్యంత ప్రముఖులు . ఉన్నతాదికారుల పర్యటనలు, కార్య క్రమాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందజేయాలని కోరారు కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ధికారి వి.శ్రీనివాసరావు జిల్లాసమాచార పౌర సంబంధాల అధికారి యు సురేంద్రనాద్, డిపిఆర్వో ఎస్. వి. మోహన్ రావు, పబ్లిసిటీ అసిస్టెంట్ వి. వి ప్రసాద్ ఫోటోగ్రాఫర్ ఎం. సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

కొలంకపురి నాటక కళాపరిషత్ దశమ ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రూరల్ గ్రామం కొలకలూరు చిన్న రథశాల వద్ద వల్లేపల్లి వెంకట్రామయ్య కళాప్రాంగణలో కొలంకపురి నాటక కళాపరిషత్, హైదరాబాద్‌కు చెందిన వైకె నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనల సభా కార్యక్రమానికి వైకె కళాపరషత్ రథసారధులు కారంపూడి వెంకట్రావ్, బొప్పన నరశింహారావు జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు వైకె కళాపరిషత్ గౌరవాధ్యక్షులు వైఎస్‌కెఎన్ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ప్రోత్సహించేందుకు కళాపరిషత్‌లు కృషి చేస్తున్నాయని, ముఖ్యంగా కొలంకపురి నాటక కళాపరిషత్ గ్రామీణ ప్రాంతంలో పదేళ్ళుగా నాటకోత్సవాలు నిర్వహించటం అబినందనీయమన్నారు. పరిషత్ తరఫున ప్రతిఏటా అందిచే 'సవ్యసాచి' పురస్కారాన్ని ఏలూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు ఎండి ఖాజావలికి అందించారు. కొలంకపురి నాటక కళాపరిషత్ అధ్యక్షులు, నటులు గోపరాజు రమణ మాట్లాడుతూ ఈనెల 19వరకు నాటిక పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గోపరాజు విజయ్, ఎస్.మురళీధర్, కాంతారావు, ఎస్.శరత్ వెంకయ్య, సుధాకర్, నూతలపాటి కాళిదాసు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహక పరిషత్ బృందం

రైతేరాజు నాటికలో సన్నివేశం

సవ్యసాచి పురస్కారం అందుకుంటున్న ఖాజావలి

రైతన్న కష్టాన్ని కళ్లకు కట్టిన రైతేరాజు

నాటిక పోటీల్లో భగంగా తొలి ప్రదర్శన 'రైతేరాజు' ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆరుగాలం శ్రమిస్తున్న రైతు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టింది. ప్రపంచంలో ఏ వస్తువు తయారు చేసినా, దాని ధర నిర్ణయించుకుని విక్రయించే అధికారం తయారీదారుకు ఉంటుందని, అయితే అందుకు భిన్నంగా రైతు పండించిన పంటకు మాత్రం ధర నిర్ణయించుకునే వీలు లేకపోవటం, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పంట చేతికొచ్చే సమయానికి దళారీలు, ఇలా అడుగడుగునా మోసపోతూ, వ్యవసాయంలో నష్టాలబారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల కష్టాలను నాటిక ప్రతిబింభింపచేసింది. హైదరాబాద్‌కు చెందిన కళాంజలి బృందం ప్రదర్శించిన నాటికకు రచన సూర్యప్రకాష్‌కాగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వ బాధ్యతలు వహించారు.

యువతకు సందేశం 'విముక్తి'

రెండో ప్రదర్శన 'విముక్తి' యువతకు సందేశాత్మకంగా నిలిచింది. కాట్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ వారి ప్రదర్శనకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు. సమాజానికి మార్గదర్శకంగా ఉండాల్సిన యువత నేడు గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై, జీవితాలను నాశనం చేసుకుంటున్న వైనాన్ని, అలాంటి పరిస్థితుల నుంచి యువతను మేలుకొలపాలన్న సందేశంతో సాగింది.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారులను సూచించారు.గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన భవనాల్లో కౌంటింగ్‌కు సంబంధించిన టేబుళ్ళు, బారికేడింగ్, సీసీ కెమేరాల ఏర్పాట్లు, అవసరమైన ఇతర సౌకర్యాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిరంతరం పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ర్యాండమైజేషన్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ రోజు టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవా లన్నారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్ఒ పెద్దిరోజా, ప్రత్తిపాడు ఆర్ఒ శ్రీఖర్, తాడికొండ ఆర్ఒ గంగరాజు, పొన్నూరు ఆర్ఒ లక్ష్మీ కుమారి, గుంటూరు పశ్చిమ ఆర్ఒ కె.రాజ్యలక్ష్మీ , డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన పసుపు ధరలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్లో గురువారం పసుపు ధరలు స్వల్పంగా తగ్గాయి. దీనితో నామమాత్రంగా కేవలం 72 కింటాలు మాత్రమే అమ్మకాలు జరిగాయి ఈ వారంలో ఎన్నికలు నిర్వహించటం తో పాటు బుధవారం ఒక విశ్రాంత ఉద్యోగి మరణించడంతో యారకు సెలవు ప్రకటించారు. దీనితో ఈ వారం యాడ్ లో అమ్మకాలు సజావుగా సాగలేదు. గతవారం ధరలతో పోల్చుకుంటే సగటు ధరలు 375 రూపాయలు తగ్గినది . గురువారం కనిష్ట ధర 12101, గరిష్ట ధర 14150 సగటు ధరలు 13700 రూపాయలు పలికినవి.

19న 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో మే 19 సాయంత్రం 6 గంటలకు స్థానిక బందావన్ గార్డెన్స్‌లోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో డాక్టర్ రవూఫ్ కవితా సంపుటి 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ సభ జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని గురువారం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ చిల్లర భవానీదేవి అధ్యక్షతన జరిగే ఈసభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పుస్తకావిష్కరణ, ప్రముఖ కవి ప్రసాదమూర్తి పుస్తక సమీక్ష చేస్తారన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారని సాహితీప్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చలపాక ప్రకాష్, ఎస్ఎం సుభాని కోరారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, తదితరులు

జెవివి ఆధ్వర్యంలో టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మే 19న ఆదివారం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాలపై ఉపాధ్యాయులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలియజేశారు. గురువారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో శిక్షణా తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఆంగ్లం పాఠ్యపుస్తకాలపై శిక్షణ ఉంటుం దని, శిక్షణను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 9948015701 నంబరులో సంప్రదించాలని సూచించారు. పోస్టర్ ఆవి ష్కరణలో టి.ఆర్.రమేష్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టి.ఆర్.చాందిని, సుబ్బరాయుడు, బి.ఉదయ్ భాస్కర్, శంకర్‌సింగ్, యం.ఉదయభాస్కర్, ఎస్ఎం.సుభాని, ఇ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో 2024-25 మొదటి విడత అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా కన్వీనర్ ఆర్ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ఎస్.వి ప్రసాద్ బాబు కోరారు. గురువారం ప్రసాద్ బాబు విలేకరులతో మాట్లాడుతూ టెన్త్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 10వ తేదీ సాయంత్రం 5గంటలకు ముగియనుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు **ఐటిఐ.ఎపి.జిఒవి.ఇన్** వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 18 నుండి 26 వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మాచర్ల ఐటిఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి రెండు సంవత్సరముల కోర్సులతోపాటు, డీజిల్ మెకానిక్ వెల్డర్ ఒక సంవత్సరం కోర్సులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బిసిజి వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

- జిల్లాలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ప్రారంభం
- ప్రతి గురువారం ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్

మంగళగిరిలో మహిళకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య కార్యకర్త

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్ హాజరై వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి, పొగ తాగే వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆశా వర్కర్స్ ఇంటింటికి వచ్చి వ్యాక్సినేషన్‌కు అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రజలు వ్యాక్సినేషన్ వేయించుకొని క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీఓ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రాజశేఖర్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలోని పి హెచ్ సి సబ్ సెంటర్లో బి సి జి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా పెద్ద వారికి కూడా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో పురిటి బిడ్డలకు మాత్రమే ఈ వ్యాక్సిన్ వేసేవారు. దేశం లోని కొన్ని రాష్ట్రాలు ఎంపిక చేసి అందులో ఎక్కువగా క్షయ వ్యాధి బారిన పడుతున్న జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీటికి సంబంధించిన వివరాలను పిహెచ్సి డాక్టర్ సి ఇందిరా తెలిపారు. క్షయ వ్యాధిని నియంత్రించడానికి 18 సంవత్సరాలు దాటిన క్షయ బారిన పడిన ఐదు సంవత్సరాల లోపు వారికి క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఈ వ్యాక్సిన్ సింగల్ డోస్ గా ఇస్తున్నారు. ప్రతి గురువారం ఏఎన్ఎంలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ వ్యాక్సిన్ వలన ఎటువంటి అనర్ధాలు ఉండవని ఆమె తెలిపారు. వ్యాధి బారిన పడకుండా ముందస్తు భద్రతా చర్యగా వ్యాధి నిరోధక వ్యవస్థ మెరుగుపరచడానికి ఈ వ్యాక్సిన్ ఎంతో మేలు చేస్తుంది అన్నారు. గర్భిణి లు హెచ్ఐవి క్యాన్సర్ బారిన పడిన వారు పిల్లలకు పాలిచ్చే బాలింతలకు ఈ వ్యాక్సిన్ వేయరని తెలిపారు.

దుగ్గిరాలలో టీకా వేస్తున్న దృశ్యం

తాడేపల్లిలో మాట్లాడుతున్న ఆరోగ్య సిబ్బంది

'ఉపాధి కార్మికులకు రూ.600 ఇవ్వాలి'

ప్రజాశక్తి-విసన్నపేట: ఉపాధి హామీ కూలీల సమస్యలపై విస్సన్నపేట మండలంలో పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్ జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు, పానం ఆనందరావు పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విస్సన్నపేట గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలు ప్రధానంగా ఉపాధి వంద రోజులు కూలీ పని దినాలు సరిపడటం లేదని 200 రోజులు పని దినాలు కావాలని అలాగే కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని కూలీలు తెలిపారు. రానున్న కాలంలో పై డిమాండ్ల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉపాధి కూలీలు పోరాటాలకు సిద్ధపడాలని కళ్యాణ్ అన్నారు.

శాంసంగ్ ఎఐ కంప్రెసర్ రిఫ్రిజిరేటర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ వేసవి సందర్భంగా సరికొత్తగా కంప్రెషర్ టెక్నాలజీతో కూడిన రిఫ్రిజిరేటర్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ఆర్.పరమేశ్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శాంసంగ్ షోరూమ్ నందు గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మూడు రిఫ్రిజిరేటర్లను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈకొత్త రిఫ్రిజిటరేటర్లు శాంసంగ్ యొక్క తాజా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పవర్డ్ ఇన్వర్టర్ కంప్రెషర్ టెక్నాలజీతో అమర్చబడినాయని అన్నారు. ఏఐ ఇన్వర్టర్ కంప్రెసర్, మోటారు, శక్తి సామర్థ్యాన్ని ఆప్టిమైజ్ చేయడం కొరకు సాంప్రదాయకంగా రూపొందించారన్నారు.

పూర్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీ లోని గుడ్ సమరిటన్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు చిట్టేలు కోటేశ్వరరావు – చిట్టేలు హరీష్ ఆధ్వర్యంలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ ఫార్మా ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ మేనేజర్ పరిపల్లి పూర్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటిగా ప్రేమ్ నికేతన్ చిల్డ్రన్స్ హోమ్ లో

నివసిస్తున్న మానసిక మరియు శారీరిక వికలాంగ బాల బాలికల మధ్య కేక్ కట్ చేసి తదనంతరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారం. ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ సమీపంలో గుడారాలలో నివసిస్తున్న నిరుపేద వలస కూలీలకు ట్రస్ట్ వ్యవస్థాపకులైన చిట్టేలు కోటేష్ –హరీష్ చేతుల మీదుగా ఆహార ప్యాకెట్లు పంచటం జరిగింది. ఈ కార్యమంలో మద్దాల శ్రీనివాసరావు, చిట్టేలు.శ్రీనివాసరావు, నాగమణి, మౌనిక, మాస్టర్.సుకుమార్, వేల్పుల రాజేష్ పాల్గొన్నారు.

ఇండియా వేదికదే విజయం : కిరణ్

ప్రజాశక్తి-మైలవరం: సార్వత్రిక ఎన్నికలలో ఇండియా వేదికదే విజయమని ఇండియా వేదిక బలపరిచిన మైలవరం

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొర్రా కిరణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు ఓటర్లను డబ్బులతో ప్రలోభ పెట్టారని వారికి తగిన గుణపాఠం ప్రజలే చెబుతారు అన్నారు. రాహుల్ గాంధీ, షర్మిల ఆధ్వర్యంలో దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందన్నారు. ఇండియా వేదిక అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించిన కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటాం

సిపిఎం 'సెంట్రల్' అభ్యర్థి బాబూరావు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: ధనరాజ్యంలో ప్రజలు చైతన్యం కావాలని, సమస్యల పరిష్కారానికి ప్రజలను చైతన్యవంత చేసి వారికి అండగా ఉంటామని, సిపిఎం ఎప్పుడూ పేదల పక్షాన నిలబడుతుందని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు అన్నారు. సిపిఎంకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గురువారం శాంతినగర్ 62 డివిజన్లో తమకు ఓటు వేసేందుకు సహకరించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలను కలిసి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ముగియడంతో టిడిపి, వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు డివిజన్ స్థాయి ఓట్ల లెక్కల్లో నిమగ్నమయ్యారని అన్నారు. ఒకరిపై ఒకరు గొడవలు పడి ఘర్షణలు పడి ఎన్నికల సమయంలో రెండు పార్టీలూ కలిసిపోయాయని అన్నారు. యి డబ్బులు పంచడం కోసం ఒప్పందలు కుదుర్చుకున్నాయని విమర్శించారు. గతంలో రాత్రి పూట డబ్బులు పంచేవారని, ఇప్పుడు పట్టపగలే డబ్బులు పంపిణీ చేసినా అధికారులు కన్నెత్తి చూడలేదని, ధనబలం రాజ్యమేలుతుందని అన్నారు. రాబోయే ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, శాంతినగర్ డివిజన్ ఇంచార్జ్ చింతల శ్రీనివాస్, సింగ్‌నగర్ ఇన్చార్జ్ నిజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభినందనలు తెలుపుతున్న సిపిఎం సెంట్రల్ అభ్యర్థి బాబూరావు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం : రేష్మా

ప్రజాశక్తి-తిరువూరు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం వల్ల డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులకు చెక్ పెట్టవ చ్చునని యూపీహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ రేష్మా బేగం అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా రేష్మా బేగం మాట్లాడుతూ డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల నిర్మూలనలో ప్రజల భాగస్వా మ్యం కావాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆయా శాఖల సమన్వయంతో గ్రామ/పట్టణ ప్రాంతాలలో దోమ లు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరో జు ఇంటింటి సర్వే, వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే పాటిం చడం ద్వారా లార్వా వద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమతెరల వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధిక జ్వరం, కండరాలు మరియు కీళ్ల నొప్పులు, చర్మం దురద, చర్మం పై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే డెంగ్యూ జ్వరంగా గుర్తించి వెంటనే సత్వర వైద్య సేవలు అందించాలని, అవసరాన్ని బట్టి వైద్యాధికారిని సంప్రదించాలని రేష్మా బేగం సూచించారు. నివాస గహాల మధ్య మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదా రం, పూడిక తొలగించడంతో పాటు లార్వా వద్ధి చెంద కుండా యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ ప్రయోగం చేయించాలని ఆమె కోరారు. అనంతరం పట్ట ణంలోని ప్రధాన వీధుల్లో డెంగీ నిర్మూలనపై అవ గాహన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూప ర్వైజర్ కె రవి, హెల్త్ విజిటర్ ఎస్.కె ఆషాబీ, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, సచివాలయ హెల్త్ సెక్రటర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వినూత్నంగా 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

ప్రతి ఒక్కరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న షో 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' కార్యక్రమానికి సరికొత్త తారాగణాన్ని ప్రకటించినట్లు ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రీజనల్ హెడ్ కె.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో షో ప్రీ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిటికల్ థ్రిల్లర్ షోలో సరోజిని నాయుడుగా మలిష్కా, లియాఖత్ ఆలీఖాన్‌గా రాజేష్‌కుమార్, వి.పి.మీనన్‌గా శంకర్ కె.సి. నటిస్తున్నారని తెలిపారు. సరోజిని నాయుడు పాత్రగురించి మలిష్క మాట్లాడుతూ ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌లో నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు పాత్ర పోషించడం గర్వకారణంగా ఉందన్నారు. ఎంతో చారిత్రాత్మక ప్రదర్శనను చక్కగా రూపొందిస్తున్నారని తెలిపారు.

శ్రీనివాసరావుకు పరామర్శ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని అప్సర అపార్ట్మెంట్‌లో ఉంటున్న యుటిఎఫ్ నాయకులు పులి శ్రీనివాసరావు ఇటీవల ప్రమాదశాత్తు బైక్‌పై నుండి కిందపడి ఎడమ కాలుకు గాయమైంది. విషయం తెలుసుకున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఉ గురువారం వారి నివాసానికి వెళ్లి శ్రీనివాసరావుని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ డివి ఆర్ కాలనీ లో నివాసం ఉంటున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా ఈ యువకుడు పేరు యర్రంశెట్టి చందు (29)గా తెలుస్తోంది. అయితే ఇతను ఆత్మహత్య చేసుకున్న తీరు అనుమానాస్పదంగా ఉందని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న నందిగామ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ పోస్టుమార్టంకు తరలించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ప్రముఖ చిత్రనటులు రాజేంద్ర ప్రసాద్ గురువారం ఆలయానికి విచ్చేశారు. శ్రీ అమ్మవారి ఆలయమునకు విచ్చేసి వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో కె.ఎస్. రామారావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

అలాగే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మరియు కుటుంబసభ్యులు శ్రీ అమ్మవారి దర్శనార్థం గురువారం ఆలయానికి విచ్చేయగా వీరికి ఆలయ ఈవో కెఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేద ఆశీర్వచనము చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదములు, చిత్రపటం అందజేసినారు. అనంతరం వీరు శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయమును సందర్శించారు.

హుండీల ఆదాయం రూ.2.09 కోట్లు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి మహామండపం ఆరవ అంతస్తులో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 16 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు: రూ.2,09,49,116లు, బంగారం: 434 గ్రాములు, వెండి: 4 కేజీల 145 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. విదేశీ కరెన్సీ: యుఎస్‌ఏ– 171 డాలర్లు, మలేషియా – 50 రింగేట్లు,



ఇంగ్లాండ్ – 5 పౌండ్లు, ఆస్ట్రేలియా – 115 డాలర్లు, కెనడా – 10 డాలర్లు, యుఏఇ– 110 దిర్హామ్స్, కువైట్ – 1 దినార్, సౌదీ – 66 రియాల్స్, బహ్రైన్ – 3.5 దినార్లు భక్తులు సమర్పించారు. ఆన్‌లైన్ ఈ– హుండీ ద్వారా రూ. 45,010లు భక్తులు చెల్లించుకొన్నట్లు దుర్గగుడి ఇఓ కెఎస్ రామారావు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్ రామారావు, సహాయ కార్యనిర్వాహణాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్ మరియు వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, భవానీ సేవా దారులు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.